క్లుప్తంగా

అయోధ్య అక్షింతలు పంపిణీ



శోభాయాత్రలో మహిళా భక్తులు

కొత్తగూడెంటౌన్: ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో విశ్వహిందూ పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతల శోభాయాత్ర మంగళవారం కొత్తగూడేనికి చేరుకుంది. స్థానిక భక్తులు శోభాయాత్ర వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. దారి పోడవునా శ్రీరామ జపంతో వీధులన్నీ మార్మోగాయి. అయోధ్య అక్షింతలు, రామాలయ నమూనా, ప్రతిష్ఠ అహ్వాన పత్రికలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో కోనేరు సత్యనారాయణ, రంగాకిరణ్ భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కొత్తగూడెంటౌన్: ప్రతి భవన నిర్మాణ కార్మికుడి ఆరోగ్యం ముఖ్యం అని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి జిల్లా అధ్యక్షుడు గాజుల రాంచందర్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం కూలీలైన్‌లోని సంఘం కార్యాలయంలో సీఎస్‌ఈ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 500 మంది కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. సీఎస్‌ఈ హెల్త్‌కేర్ ట్రస్ట్ జిల్లా కోఆరినేటర్ అక్బర్, గాజుల రాంచందర్, జి.మహేష్, బండ్ల కృష్ణ, మద్దినేని వెంకటేశ్వర్లు, ఎస్‌కే హఫీజ్, దేవినేని వెంకటేశ్వరావు, ఎండీ యాకుబ్, దాసరి శ్రీను, చందర్ పాల్గొన్నారు.

జేకే ఓసీలో న్యూ ఇయర్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: పట్టణంలోని జేకే ఓసీలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఏరియా జీఎం జాన్ ఆనంద్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, మేనేజర్ పూర్ణచందర్‌రావు, ఇంజనీర్ చిన్నయ్య, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

చదువుపై పట్టు సాధించాలి



జామెట్రీ బాక్స్‌లతో విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు చదువుపై పట్టు సాధించి రాణించాలని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ప్రభుదయాళ్ అన్నారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ, చదువుపై ఆసక్తి కనపరుస్తున్న విద్యార్థులకు మంగళవారం పెన్నులు, జామెట్రీ బాక్స్‌లు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ... చదువుపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించనున్నట్లు పేర్కొన్నారు.

'ఉపాధి'పై తనిఖీ



సామాజిక తనిఖీ గ్రామసభ

టేకులపల్లి: మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో గత నెల 31 నుంచి ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ గ్రామసభలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 10వ తేదీ వరకు ఈ గ్రామసభలు జరగనున్నాయి. మొత్తం 12 బృందాలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు కూలీల ఖర్చు రూ.52467105, సామగ్రి ఖర్చు రూ.7368752, మొత్తం రూ.59835877 సంబంధించి తనిఖీలు నిర్వహించి గ్రామ సభల్లో వివరాలు తెలుసుకుంటున్నారు. తనిఖీలు పూర్తయిన తరువాత ఈనెల 11న టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ఓపెన్‌ఫోరం సభ జరుగుతుందని ఉపాధి హామీ పథకం ఏపీఓ కాళంగి శ్రీనివాస్ తెలిపారు.

క్రీడలతో ఐకమత్యం



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: క్రీడలు యువతలో ఐకమత్యాన్ని ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామంలో యంగ్ తరంగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే మంగళవారం తిలకించారు. కొద్దిసేపు యువతతో వాలీబాల్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడగా పేరొందిన వాలీబాల్‌ను ఏజెన్సీ యువత మరింతగా ఆదరించడం అభినందనీయమన్నారు. వరుసగా ప్రతి ఏటా నూతన సంవత్సరం సందర్భంగా పోటీలు నిర్వహించడం గ్రామ యువతలో ఐకమత్యానికి నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో మిగతా గ్రామాలు సైతం గ్రామీణ క్రీడలను సాధన చేయడం, మండల, డివిజన్, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించాలని ఆకాంక్షించారు. అటువంటి యువతను ప్రోత్సహించాలన్నారు. యువతను సన్మార్గంలో నడిపేది క్రీడలేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొజ్జాయిగూడెం సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, ఎంపీటీసీ మెట్టెల శిరోమణి, గ్రామపెద్దలు బద్దం నగేష్, కొర్స కోటయ్య, మాధవరావు, కొడెం రమేష్, కుంజ శ్రీనివాస్, కోరం బాబురావు, కుంజ లక్ష్మీనారాయణ, కుంజ రాకేష్, పాదెం ప్రశాంత్, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమానికి నిధులివ్వండి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఇల్లెందురూరల్: ఆదివాసీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఆదివాసీ ధార్మిక ప్రచార సమితి ప్రతినిధి చుంచు రామకృష్ణ కోరారు. బొజ్జాయిగూడెం గ్రామంలో మంగళవారం సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీలలో తొమ్మిది తెగల ఐక్యత కోసం మూడేళ్లుగా తాము ధర్మ ప్రచారం చేస్తున్నామని చెప్పారు. కేంద్రం, రాష్ట్రంలో పాలకులు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడారం జాతరకు కేటాయించినట్లుగా ఆదివాసీలు వేల్పులు, సమ్మక్క, సారలమ్మ జాతర జరిగే ప్రాంతాలలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతోపాటు ఆదివాసీ ప్రజాప్రతినిధులను కలిసి ఆదివాసీ సంక్షేమానికి, ఆదివాసీ ధార్మిక పరిషత్ నిర్మాణ విస్తరణకు సహకరించాలని కోరుతామన్నారు. సమావేశంలో కొర్స కోటయ్య, చీమల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సభను విజయవంతం చేయండి..



నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఉద్యమకారుల భవిష్యత్ కార్యాచరణ సభను విజయవంతం చేయాలని జేఏసీ జిల్లా కన్వీనర్ చార్వాక అన్నారు. మంగళవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బుధవారం ఖమ్మంలోని ఎంఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరుగుతుందన్నారు. ఉద్యమకారుల భవిష్యత్ కార్యాచరణ పేరుతో నిర్వహించే ఈ సభకు ప్రొఫెసర్ కోదండరాం, గాదె ఇన్నయ్య, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, ఉమ్మడి జిల్లా ఉద్యమకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల నుంచి ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో చీకటి కార్తీక్, నవతన్, సురేష్, వల్లాల భరత్, జాడి మంజుల తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదు



దరఖాస్తు స్వీకరిస్తున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు

జూలూరుపాడు: ఆరు గ్యారెంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదని డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు అన్నారు. మాచినేనిపేట తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభను ఆయన ప్రారంభించారు. స్వయంగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అదేవిధంగా హెల్ప్ డెస్క్, కౌంటర్లు, రిజిస్టర్లు, దరఖాస్తు స్వీకరణ తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలులో భాగంగా ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డుల్లో ఆంధ్రప్రదేశ్ ఉన్నా సవరణ అవసరం లేదన్నారు. ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్‌లతోపాటు, ఒక పాస్ ఫొటో జత చేస్తే సరిపోతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఖమ్మం జిల్లా ఉంటే దరఖాస్తులు తీసుకోరని, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అడుగుతున్నారనే పుకార్లను నమ్మొద్దని ప్రజలను కోరారు. ఏదైనా సలహాలు, సూచనల కోసం హెల్ప్ డెస్క్, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్ తదితరులను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భీమ్లా నాయక్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏఓ ఎస్ రఘుదీపిక, ఎంపీటీసీ సభ్యురాలు బానోత్ నీల, ఉపసర్పంచ్ లకావత్ బుజ్జి, మాజీ సర్పంచ్ లకావత్ గిరిబాబు, ఏఈఓ గోపీకృష్ణ, కార్యదర్శి బి.జ్యోతి, విజయలక్ష్మి, సరిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ఇల్లెందు: డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య జన్మదిన వేడుకలు ఇల్లెందులో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియేల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుదర్శన్ కోరీ, పింగళి నరేష్, ఈసం నర్సింహరావు, జాఫర్, ఐజాక్, జగన్నాథం, జీవీ భద్రం, ఎల్.కృష్ణ, అక్తర్, స్వరూప, రాజేందర్, జాన్సన్, రామకృష్ణ, బాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బర్దన్‌తోనే శ్రమజీవులకు విముక్తి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): శ్రమజీవుల విముక్తి కోసం నిరంతరం శ్రమించిన ఏబీ బర్దన్ ఆశయాలు సాధించాలని సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా అన్నారు. పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ 8వ వర్ధంతిని మంగళవారం శేషగిరిభవన్‌లో నిర్వహించారు. తొలుత బర్దన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాషా మాట్లాడుతూ.. 16 ఏళ్ల వయస్సులోనే భారత కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడిగా చేరి అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. రక్షణరంగంలోని ట్రేడ్ యూనియన్లను ఐక్యం చేయటంలో అయన కృషి చేసి ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని జాతీయ స్థాయిలో ముందుకు నడిపిందన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి మురళి, మాతంగి లింగయ్య, లక్ష్మీనారాయణ, వేల్పుల భాస్కర్, బి.రమికుమార్, తదితరులు పాల్గొన్నారు. పాల్వంచ: సీపీఐ, ఏఐటీయూసీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబి.బర్దన్ వర్ధంతి సందర్భంగా సీఆర్ భవనంలో ఏర్పాటు సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ.. 16 ఏళ్ల వయస్సులోనే సీపీఐ సభ్యుడిగా చేరి అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని కొనియాడారు. అటవీ హక్కుల చట్టం, భవన నిర్మాణ కార్మిక చట్టం, సమాచార హక్కు చట్టం బర్దన్ కృషి ఫలితమే అన్నారు. కార్యక్రమంలో బండి నాగేశ్వరరావు, ఉప్పుశెటి రాహుల్, దుగ్గిరాల సుధాకర్, గుండాల నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఇట్టి వెంకట్రావ్ పాల్గొన్నారు.

నేడు ప్రజాపాలన గ్రామసభలు

సుజాతనగర్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా సర్వారం, సుజాతనగర్, సింగభూపాలెం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం, మామిడిగుండాల గ్రామపంచాయతీలలో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలరాజు మంగళవారం తెలిపారు. రేపల్లెవాడ, బాలాజీనగర్, మామిడిగూడెం, సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలలో బుధవారం కూడా గ్రామసభలు కొనసాగుతాయని చెప్పారు.

టేకులపల్లి: మండలంలో బుధవారం గొల్లపల్లి, కొత్తతండా(పి), బేతంపూడి, గంగారం, బద్దుతండా, కోయగూడెం పంచాయతీల్లో గ్రామసభలు మంగళవారం ఎంపీడీఓ కోట వీరబాబు తెలిపారు.

ప్రమోషన్లు, బదిలీలను కొనసాగించండి..



మాట్లాడుతున్న శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): ఎలక్షన్ కోడ్‌తో నిలిపివేసిన ప్రమోషన్లు, బదిలీలను కొనసాగించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కొత్తగూడెం బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిలో ప్రతీ సంవత్సరం సెప్టెంబర్‌లో వివిధ పనులలో యాక్టింగ్ ఆధారంగా కార్మికులకు ప్రమోషన్లు ఇస్తారని, అసెంబ్లీ, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల కోడ్‌తో యాజమాన్యం వాటిని నిలిపివేసిందని, కోడ్ ముగిసింది కాబట్టి వెంటనే వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. సంస్థ డైరెక్టర్ పా ఇటీవల కాలంలో నోట్ ఫైల్ మీద సంతకాలు పెట్టిన కార్మికుల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. అండర్ గ్రౌండ్‌లో ఏడు సంవత్సరాలు, సర్ఫేస్‌లో ఎనిమిది సంవత్సరాలకు రావాల్సిన ఎస్ఎల్‌యూ/ఎస్‌ఎల్‌పీ ప్రమోషన్లు కూడా ఇవ్వకుండా నిలిపివేయటం విడ్డూరంగా ఉందని, దిగిపోయిన కార్మికులకు ఇవ్వాల్సిన 32శాతం ఇన్సెంటివ్, దీపావళి బోనస్, ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపిందని యాజమాన్యం తక్షణమే స్పందించాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్ కుమార్

జూలూరుపాడు: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆస్పత్రికి తెలియజేయాలని సూచించారు. మాతాశిశు మరణాల రేటు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారుల్లో వచ్చే శ్వాసకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమ్ము, టీబీ, జ్వరాలు, జలుబు, దగ్గు, జ్వరాలు, షుగరు, బీపీ, హెచ్ఐవీ వంటి నివారణకు తీసుకోవలిసిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీ సుభద్రమ్మ, ఏఎన్‌ఎంలు రాజమ్మ, తార, మంగమ్మ, ఝాన్సీరాణి, ఆదిలక్ష్మి, వెంకటముత్యం, రాణి, సావిత్రి, సుజాత, పార్వతి, సుశీల, అనూష, పరమేశ్వరి పాల్గొన్నారు.

'ప్రజాపాలన'లో రసాభాస



మాట్లాడుతున్న చైర్మన్ డీవీ



ప్రజలను సముదాయిస్తున్న పోలీసులు

ఇల్లెందు: పట్టణంలో మంగళవారం జరిగిన ప్రజాపాలన వార్డు సభలో రసాభాస జరిగింది. పట్టణంలోని 7వ వార్డులో జరిగిన గ్రామసభలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ప్రసంగిస్తుండగా తాజా మాజీ కౌన్సిలర్ల భర్తలు సామల రవితేజ, పర్వే శ్రీనివాస్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతమంది జిరాక్స్ పత్రాలు పంపిణీ చేస్తున్నారని, ప్రభుత్వం అందజేసే కలర్ దరఖాస్తులను మాత్రమే ఉపయోగించాలని చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ప్రజలకు వివరించగా ఈ ఘటన జరిగింది. అక్కడి పోలీసులు సీఐ కరుణాకర్‌కు సమాచారం అందించగా గ్రామసభలు ప్రశాంతంగా జరగాలని, ప్రజలు సహకరించాలని, ఎవరైనా గలాట సృష్టిస్తే నచ్చజెప్పి పక్కకు పంపించాలని సీఐ సూచించటంతో అక్కడి పోలీసులు వారిని శాంతింపజేశారు. ఈ క్రమంలోనే చైర్మన్ డీవీ, కమిషనర్ నవీన్‌లు ప్రభుత్వ లక్ష్యం గ్రామసభ ఉద్దేశ్యాలను వివరించారు.

దళారులను నమ్మొద్దు..

ఆరు గ్యారంటీల అమలు కోసం సాగుతున్న గ్రామ సభలకు కొంతమంది జిరాక్స్ దరఖాస్తు పత్రాలు అందజేస్తున్నారని, మరికొంత మంది దళారుల అవతారం ఎత్తి పథకాలు ఇప్పిస్తామని నమ్మిస్తున్నారని వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం ఇల్లెందు పట్టణంలోని 7,8,9 వార్డుల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన మాట్లాడారు.

ఆయా వార్డులలో వార్డు ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ వర్కర్‌లతో కూడిన బృందం పర్యటించి దరఖాస్తులు అందజేస్తారని వాటిని మాత్రమే స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ నవీన్, మేనేజర్ అంకుషావలీ, కౌన్సిలర్లు సామల మాధవి, మడత రమ, నాగలక్ష్మి, దొడ్డా డానియేల్, సుదర్శన్‌కోరీ, ఎర్ర ఈశ్వర్, రాజూరి మంజుల, గోపగాని రాజుగౌడ్ స్థానికులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయహస్తం ప్రారంభించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుజాతనగర్: ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన పేరుతో స్వీకరిస్తున్న దరఖాస్తులలో అంబేద్కర్ అభయహస్తం పథకం చేర్చాలని కోరుతూ దళిత ఐక్య వేదిక నాయకుల ఆధ్వర్యంలో ఎంపీఓ ఖాజామొహినుద్దీన్ ఖాన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత సాధికారత కోసం సీఎం రేవంత్‌రెడ్డి దళిత కుటుంబాలకు ప్రకటించిన రూ.12 లక్షల అంబేద్కర్ అభయహస్తం ప్రజాపాలన దరఖాస్తులో లేదని, ఈ అంశాన్ని తక్షణమే చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వేల్పుల భాస్కర్, సిరిగిరి మురళి, గండమాల భాస్కర్, తోకల వెంకటేశ్వర్లు, శేఖర్, కుక్కమూడి ప్రసాద్, కళ్యాణం చిన్న రామయ్య, పసుపులేటి తిరుపతి కష్ణ, కళ్యాణం నరసింహారావు, సిరిగిరి భాస్కర్, కత్తి శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: నిరుపేద దళిత, గిరిజనుల కోసం అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని బీఎస్పీ జిల్లా నాయకుడు తంబర్ల నరసింహారావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. ఇందిరమ్మ అభయ హస్తం ఆరు గ్యారెంటీల పథకం అమలు చేస్తున్నట్లుగానే అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా నిరుపేద దళిత, గిరిజన ప్రతి కుటుంబానికి రూ 12 లక్షలు అందజేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత, గిరిజన కుటుంబాలకు మేలు చేసే విధంగా కృషి చేయాలని కోరారు.

బలరామ్ నియామకంపై హర్షం



బలరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో డైరెక్టర్ పా విధులు నిర్వహిస్తున్న ఎన్.బలరామ్‌ను సింగరేణి సీఎండీగా నియమించిన సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట గల అసోసియేషన్ కార్యాలయంలో ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా బలరామ్‌ను పూర్తిగా సీఎండీగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. సీఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరామ్ నూతన బావులు తీసుకరావాలని, ప్రధానంగా కొత్తగూడెం ఏరియాలో రాంపూరం భూగర్భగని, వీకే-7ఓసీ, పెనగడప ఓసీలను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధితోపాటు, సంస్థకు మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉంటాయన్నారు. దీంతోపాటు డిస్మిస్ కార్మికులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఉద్యోగావకాశాలు కల్పించాలని, పారదర్శకంగా మెడికల్ ఇన్‌వాలిడేషన్ పక్రియ చేపట్టాలని కోరారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో ప్రస్తుతం ఉన్న 35 సంవత్సరాల వయోపరిమితిని 40 సంవత్సరాలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రిటైర్డ్ జీఎం (ఐఆర్‌పీఎం) అందెల ఆనందరావు, కొత్తగూడెం ఏరియా లైజన్ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్, మాల కొండయ్య, మోరే రమేష్ కుమార్, జిమ్మిడి మల్లేష్, అనిల్ కుమార్, పానగంటి అంకూస్, బాలరాజు పాల్గొన్నారు.

బలరామ్‌ను కలిసిన ఏఐటీయూసీ నాయకులు..

సింగరేణి సంస్థ నూతన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీ ఎండీ)గా బాధ్యతలు చేపట్టిన ఎన్.బలరామ్‌ను సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై చర్చించారు. సీఎండీని కలిసిన వారిలో ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు కార్యదర్శి మిరియాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు సారయ్య, కే.వీరభద్రయ్య, వైవీ రావు, ముస్కే సమ్మయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రామసభలు

ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం పలు గ్రామాల్లో జరిగిన సభలలో అధికారులు ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు ఆరు గ్రారెంటీలను అమలు చేయనుందని పేర్కొన్నారు. అనంతరం ప్రజలు దరఖాస్తులను అధికారులకు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: గ్రామసభలో మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు



టేకులపల్లి: రామచంద్రునిపేటలో గ్రామసభ



చుంచుపల్లి: దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు



జూలూరుపాడు: కౌంటర్లలో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు



సుజాతనగర్: వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ విద్యాలత